

పాలకొల్లులో దారెత్తించిన సూరీడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో సూరీడు నిప్పులు రోజురోజుకూ చిమ్ముతున్నాడు. దీంతో శనివారం జరిగే వారపు సంత వగలు నిర్మానుష్యంగా ఉంటోంది. సాధారణంగా సంతకు పొరుగు గ్రామ ప్రజలు ఎక్కువగా వస్తారు. అయితే రోడ్లపైకి రావడానికి ప్రజలు సాహసించడం లేదు. గ్రామీణ రోడ్లపై కూడా జనాలు లేక నిర్మానుష్యంగా ఉంటున్నాయి. రోహిణి కార్తె ప్రభావం తొలి 3 రోజులు లేకపోయినా తరువాత సూరీడు విజృంభించడంతో ప్రజలు ఇంటిపట్టునే ఉంటున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న శనివారపు సంత

ఊరూ.. వాడా 'బెల్టు'షాపులే..!

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

ప్రతి గ్రామంలోనూ రెండుకుపైగా బెల్టు దుకాణాలు

క్వార్టర్ బాటిల్‌కు రూ.20 వరకూ అదనంగా వసూలు

కొన్నిచోట్ల లైసెన్స్ షాపుల తరహాలో ఏర్పాట్లు

ఏలూరు జిల్లాలో నెలకు రూ.వంద కోట్లు, పశ్చిమలో అంతకు మించి మద్యం విక్రయాలు

దుకాణాల్లో ఎంఎల్‌ఎలకు వాటాలుండటంతో అడిగే నాథుడే కరువు

పర్మిట్లు లేకపోయినా సిట్టింగ్ ఏర్పాటు చేసి మరీ అమ్మకాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మద్యం విక్రయాలకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్నదానికి.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి సంబంధం లేకుండాపోయింది. లైసెన్స్ దుకాణాలకు అదనంగా వందల సంఖ్యలో బెల్టుషాపుల్లో నిత్యం మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ప్రతి గ్రామంలోనూ రెండు, అంతకుమించి బెల్టు షాపులు నడుస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. కొన్ని గ్రామాల్లో ప్రాంతాలవారీగా బెల్టు షాపులు సైతం ఏర్పాటు చేసిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత కొత్త మద్యం పాలసీని తెచ్చింది. టెండర్ల ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు చేపట్టింది. 2024 అక్టోబర్‌లో ఈ ప్రక్రియను పూర్తి చేసింది. ఏలూరు జిల్లాలో 144, పశ్చిమలో 175 మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు ఇచ్చింది. గీత కార్మికులకు కొన్ని దుకాణాలను కేటాయించింది. మద్యం దుకాణాల్లో స్థానిక ఎంఎల్‌ఎలకు పెద్దఎత్తున వాటాలు



ఉండటంతో అమ్మకాలపై నియంత్రణ అనేది పూర్తిగా లేకుండాపోయింది. ఎంఎల్‌ఎల కనుసన్నల్లో మద్యం దుకాణాలు నడుస్తుండటంతో ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొంది. ప్రతి లైసెన్స్ దుకాణానికి అనుబంధంగా పెద్దఎత్తున బెల్టుషాపులు నడుస్తున్నాయి. ఈ దుకాణాలు సైతం కూటమి పార్టీలకు సంబంధించిన అనుయాయుల చేతుల్లోనే ఉన్నాయి. ప్రతి గ్రామంలోనూ రెండుకుపైగా బెల్టుషాపులు ఉన్నాయి. లైసెన్స్‌డ్ షాపుల నుంచి బాటిళ్లు తీసుకెళ్లి బెల్టు షాపుల్లో విక్రయాలు సాగిస్తున్న పరిస్థితి ఉంది. బెల్టు షాపుల్లో క్వార్టర్ బాటిల్‌కు రూ.20 అదనంగా ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. దూరంగా ఉన్న మద్యం దుకాణాలకు వెళ్లలేక మందుబాబులు అత్యధికంగా బెల్టుషాపులలోనే మద్యం కొనుగోలు చేస్తున్నారు. చిన్నస్థాయి బెల్టు దుకాణంలో సైతం రోజుకు 50 బాటిళ్ల విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని బెల్టు దుకాణాల్లో వందల బాటిళ్ల విక్రయాలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల బెల్టు దుకాణాలను సైతం లైసెన్స్ షాపుల తరహాలో ఏర్పాటు చేసి విక్రయాలు సాగించేస్తున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోని పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో నెలకు రూ.90 నుంచి రూ.వంద కోట్లు మద్యం అమ్మకాలు సాగుతున్నాయంటే ఆశ్చర్యపోక తప్పదు. ప్రతి నెలా లక్షా నుంచి లక్షా 30 వేల మద్యం కేసుల విక్రయాలు సాగుతున్నాయి. ఒక్కో కేసులో 48 క్వార్టర్ బాటిళ్లు ఉంటాయి. 70 వేల వరకూ బీర్ కేసులు అమ్మకాలు చేస్తున్నారు. ఇక పశ్చిమలో లైసెన్స్ దుకాణాలు ఎక్కువగా ఉన్నాయి. బెల్టుషాపులు సైతం పెద్దఎత్తున సాగుతున్నాయి. దీంతో ఏలూరు జిల్లాకు మించి పెద్దఎత్తున అమ్మకాలు సాగుతున్నాయి. యువతను పూర్తిగా మద్యం మత్తులోకి నెట్టేస్తున్న పరిస్థితి ఉంది. ఇదంతా ఒక పథకం ప్రకారమే జరుగుతుందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

పర్మిట్లు లేకుండానే సిట్టింగ్ అమ్మకాలు

నిబంధనల ప్రకారం మద్యం లైసెన్స్ దుకాణాల వద్ద మద్యం బాటిళ్ల విక్రయాలు మాత్రమే సాగాలి. పర్మిట్లకు అనుమతిస్తేనే అక్కడ కూర్చుని తాగే (సిట్టింగ్) ఏర్పాటు చేయాలి. పర్మిట్లు లేకపోయినా మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్ ఏర్పాటు చేసి మరీ మద్యం అమ్మకాలు సాగించేస్తున్నారు. ప్రతి మద్యం దుకాణంలోనూ ఎంఎల్‌ఎలు, వారి అనుయాయులకు వాటాలు ఉండటంతో ఎక్సైజ్ అధికారులు పట్టించుకోని పరిస్థితి ఉంది. పట్టణాల్లో యథేచ్ఛగా ఈ ప్రక్రియ సాగుతున్నా ఏ ఒక్కరికీ పట్టడం లేదు. పలు దుకాణాల్లో ఎంఆర్‌పికి మించి మద్యం విక్రయాలు సాగిస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. రాత్రి పది గంటలకు మద్యం దుకాణాలు మూసివేయాల్సి ఉన్నప్పటికీ చాలాచోట్ల రాత్రి 11 గంటలు, 12 గంటల వరకూ సైతం మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు ఏ ఒక్కటీ మద్యం అమ్మకాల్లో అమలు కావడం లేదు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడానికి మద్యం దోపిడీ సైతం ప్రధాన కారణంగా కన్పిస్తోంది. బెల్టుషాపులు ఏమీ లేవంటూ ఎక్సైజ్ అధికారులు మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎక్కడ బెల్టుషాపు ఉందో అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలూ లేకుండాపోయాయి. ఎంఎల్‌ఎల ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు నడుస్తుండటమే దీనికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు. వైసిపి ప్రభుత్వంలో మద్యం దోపిడీ ఒకలా ఉంటే.. కూటమి ప్రభుత్వంలో మరోలా కొనసాగుతుందని, పెద్దగా తేడా కనిపించడం లేదనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది.

పాలకొల్లులో ఒక పూటే కుళాయి నీరు

ప్రజాశక్తి - పాలకొల్లు

నిడదవోలు-నరసాపురం కాలువలో పూడికతీత పనుల నేపథ్యంలో నీరు విడుదల ఆలస్యం కానున్న నేపథ్యంలో పట్టణంలో ఒకపూటే తాగునీరు సరఫరా చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఏడో తేదీ శనివారం నుండి ఈ విధానం అమల్లోకి తీసుకొచ్చామని, ప్రతిరోజూ ఉదయం ఆరు నుండి ఏడు గంటల వరకూ మాత్రమే తాగునీరు సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కోరారు.

జిల్లాకు 1949 పెన్షన్లు మంజూరు

12న వితంతు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం ఒంటరి మహిళలకు శుభవార్త చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈ నెల 12వ తేదీ నాటికి ఏడాది పూర్తి కానున్న నేపథ్యంలో ఆ రోజు వితంతు పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 1949 మంది ఒంటరి మహిళలకు పింఛన్లు అందిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలాల వారీగా లబ్ధిదారుల జాబితా విడుదల చేశారు. వాస్తవంగా 2023 డిసెంబర్ నుంచి ఒంటరి మహిళలకు పింఛన్ మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గతేడాది నవంబరు వరకు వచ్చిన 1963 దరఖాస్తులను పరిశీలించారు. వాటిలో 1949 మందిని అర్హులుగా ఎంపిక చేశారు.

మండలాలవారీ మంజూరైన పింఛన్లు

ఆచంట మండలంలో 73, ఆకివీడు 44, ఆకివీడు (అర్బన్) 20, అత్తిలి 63, భీమవరం 86, భీమవరం (అర్బన్) 67, గణపవరం 89, ఇరగవరం 81, కాళ్ల 76, మొగల్తూరు 87, నరసాపురం 114, నరసాపురం (అర్బన్) 41, పాలకొల్లు 91, పాలకోడేరు 80, పాలకొల్లు (అర్బన్) 48, పెంటపాడు 88, పెనుగొండ 86, పెనుమంట్ర 67, పోడూరు 87, తాడేపల్లిగూడెం 116, తాడేపల్లిగూడెం (అర్బన్) 79, తణుకు 69, తణుకు అర్బన్ 71, ఉండి 76, వీరవాసరం 67, యలమంచిలి 83 చొప్పున మంజూరయ్యాయి.

గంజాయి విక్రేతలు నలుగురు అరెస్టు

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

ఏలూరు డిఎస్‌పి శ్రావణకుమార్

ప్రజాశక్తి - గణపవరం

గణపవరంలో గంజాయి అమ్ముతున్న నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఏలూరు డిఎస్‌పి శ్రావణకుమార్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముద్దాయిల నుంచి రూ.50 వేలు విలువైన ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఒడిశ్శాకు కార అర్జున్ (32), ఉండి మండలం కోలమూరుకు చెందిన దగ్గుపల్లి జోగా మారీష్ (25), గణపవరానికి చెందిన యాళ్ల సాయికిషోర్ (27), రాయపరెడ్డి తరుణ్ (20)లను అరెస్టు చేసినట్లు వివరించారు. అర్జున్‌తో మిగిలిన ముగ్గురు పరిచయం పెంచుకుని అక్కడ నుంచి ఆటో డ్రైవర్ సాయంతో గంజాయి తీసుకొస్తున్నట్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రావణకుమార్

గుర్తించామన్నారు. స్థానిక మార్కెట్ యార్డు వద్ద శనివారం వారు గంజాయిని అమ్ముతుండగా దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని వివరించారు. వీరిని పట్టుకోవడంతో చాకచక్యంగా వ్యవహరించిన నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్‌ను, గణపవరం ఎస్‌ఐ ఎం.మణికుమార్‌ను, సిబ్బందిని ఏలూరు జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ అభినందించారు.

సాంకేతిక సమస్యలతో ఉపాధ్యాయులకు నష్టం

ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్‌తో న్యాయం చేయాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు

నేడు ఏలూరు డిఇఒ కార్యాలయ ముట్టడికి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

ఇప్పటి వరకు జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో సాంకేతిక సమస్యలు రావడంతో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలిగిందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు ఆరోపించారు. ఎస్‌జిటిలకు మ్యానువల్ కౌన్సెలింగ్ ద్వారా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉమ్మడి ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా యూనిట్ శనివారం నిరసన తెలిపింది. అనంతరం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా యూనిట్ సమావేశమై వివిధ అంశాలపై చర్చించింది. బదిలీల్లో ఏర్పడిన సాంకేతిక సమస్యలను నిరసిస్తూ ఆదివారం ఉదయం 10 గంటలకు ఏలూరు డిఇఒ కార్యాలయ ముట్టడికి ఉమ్మడి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ మే 19వ తేదీన పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ సమక్షంలో జరిగిన చర్చల సందర్భంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టడానికి అంగీకరించారని గుర్తు చేశారు. అయితే ఎస్‌జిటిలకు మళ్లీ వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని శుక్రవారం రాత్రి ఎనేబుల్ చేశారని చెప్పారు. ఇది ఇచ్చిన హామీని ఉల్లంఘించడమేనని అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతేకాక ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు ఇప్పటి వరకు జరిగిన బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియలో అనేక సాంకేతికపరమైన సమస్యలు తలెత్తడం వల్ల చాలామంది ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. సాంకేతిక సమస్యల వల్ల నష్టపోకుండా ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ మాట్లాడుతూ ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించడం, ఇప్పటి వరకు జరిగిన బదిలీల ప్రక్రియలో దొర్లిన అసంబద్ధాలను సవరించాలని కోరుతూ ఏలూరు డిఇఒ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ (257) నాయకులు జి.ప్రకాష్, పిఆర్‌టియు నాయకులు సిహెచ్‌వి.చలం, ఎపియుఎస్ నాయకులు డి.బాపిరాజు, హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు ఎంఎన్ఎస్.నారాయణ, యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, ఎపిటిఎఫ్ (1938) నాయకులు రమణారావు, ఎస్‌టియు నాయకులు కె.సురేష్, పిఆర్‌టియు నాయకులు కెఎస్ఎస్.రామాంజనేయులు, పి.నాగేశ్వరరావు, కుమార్‌స్వామి, బి.నాగమురళి శ్రీనివాసరావు, బి.నాగబాబు, జి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



పాలకొల్లులో..

పాలకొల్లు: ఎస్‌జిటికు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చి తాజాగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ చేపడతామని ప్రకటించడం దారుణమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం చెప్పారు. శనివారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఎంఇఒ జి.విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామభద్రం, రాష్ట్ర కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పడం ఉపాధ్యాయులను వంచించడమేనన్నారు. ఉపాధ్యాయులు రెండు జిల్లాల్లోని ఖాళీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం పెద్ద ప్రహసనం అని, దీనివల్ల ఏ పొరపాటు జరిగినా ఖాళీల భర్తీలో తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ఏ విధమైన ఆర్థిక భారం లేని విధానాన్ని అడుగుతుంటే ఎందుకు ఈ విధంగా విద్యాశాఖ అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారో తమకు అర్థం కావడం లేదని అన్నారు. వెంటనే మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ చేపట్టి, బదిలీలు నిర్వహించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండలాధ్యక్షులు డి.క్షేమమూర్తి, గౌరవాధ్యక్షులు బి.శేషగిరిరావు, నాయకులు కె.పెద్దిరాజు, సిహెచ్.త్రినాధ్, డివివి.ప్రసాద్, ఎంపి.రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




భీమవరంలో నినదిసుతన్న ఉపాధ్యాయ నేతలు

భూగర్భ జలాల తరలింపు నిలిపివేయాలి

పాలకోడేరు పంచాయతీ కార్యదర్శికి వివేకానంద కాలనీవాసుల వినతి

ప్రజాశక్తి - పాలకోడేరు

భూగర్భ జలాల తరలింపు నిలుపుదల చేయాలని పాలకోడేరు వివేకానంద కాలనీ వాసులు డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి గోపికి కాలనీవాసులు శనివారం వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లా అంటే స్వచ్ఛమైన మంచినీటికి పేరని అయితే ఇప్పుడు ఆక్వా రైతాంగం పరిశ్రమల వల్ల పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. స్వచ్ఛమైననీరు సంగతేలా ఉన్న నీరు దొరకక కొనుగోలు చేసి తాగాల్సి వస్తుందన్నారు. ఈ పరిస్థితిలో మా కాలనీకి సమీపంలో పాలకోడేరులో ఉన్న రొయ్య పరిశ్రమకు భారీ పైపులైన్ల ద్వారా నీరు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే సమీపంలో నుంచి పరిశ్రమకు ఏళ్ల తరబడి నీరు తోడేయడం వల్ల భూగర్భ జలాలు అంతరించిపోతున్నాయన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిని అందజేస్తున్న వివేకానంద కాలనీవాసులు

ఇప్పుడు మళ్లీ ఈ కొత్త పైపులైను ఏర్పాటు మరింత ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో భూగర్భ జలాల తరలింపు నిలుపుదలచేసి మాకు భవిష్యత్‌లో నీటి సమస్య రాకుండా చూడాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని చిట్టవరం గ్రామంలోని జెడ్‌పి హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ప్రతిభ చూపారని హెచ్‌ఎం పొత్తూరి శ్రీనివాసరాజు తెలిపారు. విద్యార్థులు శీలబోయిన జ్యోష్ణవి, ఏలూరి అను, గొల్లమందుల అక్షిత, ఇంజేటి ఏసురాజు, ఇబ్బా దుర్గాదేవిలు ఎన్‌ఎంఎంఎస్‌కు(జాతీయ ప్రతిభ ఉపకార వేతనాలు) ఎంపిక అయ్యారన్నారు. మండల స్థాయిలో ఒకేసారి ఐదుగురు విద్యార్థులు ఎంపిక అవ్వడం ఇదే తొలిసారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని హెచ్‌ఎం గుబ్బల వెంకటస్వామి, ఉపాధ్యాయులు ఎంఎస్ఎన్, గ్రామస్థులు అభినందించారు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవడంతో పాటు వారిని ప్రోత్సాహించడం వల్లే విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు.

జాతీయ ప్రతిభా ఉపకార వేతనం పోటీ పరీక్ష ఫలితాల్లో పలువురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు నరసాపురం ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు. నరసాపురం పట్టణం చినమామిడిపల్లి పురపాలక ఉన్నత పాఠశాలలో ఏడుగురు, పీచుపాలెం-3, టేలరుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు-1, చిట్టవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐదుగురు ఉత్తీర్ణులు అయ్యారని ఆమె తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆల్కహాల్ అని పేరున్నదేదీ సేవించకూడదు

ఆల్కహాల్‌పై కార్మికులకు అవగాహనా కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి

ప్రజాశక్తి - తణుకు

ఆల్కహాల్ అని పేరు ఉన్న ప్రతీది మానవుడు సేవించడానికి అర్హమైనవి కావని, వాటిలో ఇథైల్ ఆల్కహాల్ మాత్రమే మానవుడు ప్రత్యక్షంగా సేవించవచ్చునని, మిగతా ఆల్కహాల్ అన్ని కూడా ప్రమాదకరమైనవని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. శనివారం పైడిపర్రులోని ఫ్లూటాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్‌లో కార్మికులకు పలు రకాల ఆల్కహాల్, వాటి ఉపయోగం, వాటి వల్ల కలిగే ప్రమాదం, వాటి పట్ల ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలి అనే అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్కహాల్ అన్ని కార్బన్, ఆక్సిజన్, హైడ్రోజన్ సమ్మేళనంతో కూడుకొని ఉంటాయని, ఆల్కహాల్‌లో ఇథైల్ ఆల్కహాల్, డినేచర్డ్ ఆల్కహాల్, మిథైల్ ఆల్కహాల్, ఐసో ప్రొఫైల్ ఆల్కహాల్ కలవని తెలిపారు. ఇవన్నీ చూడటానికి వాసన పరంగా కూడా ఒకేవిధంగా ఉన్నా మానవుడు సేవించడానికి అర్హమైనవి కాదని, వాటిలో కేవలం ఇథైల్ ఆల్కహాల్ మాత్రమే నేరుగా సేవించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. అసహజ ఆల్కహాల్ లేదా డినేచర్డ్ ఆల్కహాల్ అనేది ఇథైల్ ఆల్కహాల్‌కు బెంజిన్, పిరిడిన్ వంటి ప్రమాదకరమైన రసాయనాలను కలిపి పారిశ్రామిక ప్రయోజనాలకు ఉపయోగిస్తారన్నారు. శుభ్రపరిచే ఉత్పత్తులు, ఇంధనాలు, పారిశ్రామిక ఉత్పత్తులు, చర్మ సంరక్షణ ఉత్పత్తులు, హ్యాండ్ శానిటైజర్లు, క్రిమిసంహారకాలు తదితరాల్లో ఉపయోగిస్తారని తెలిపారు. మిథైల్ ఆల్కహాల్ అనేది ఫార్మా పరిశ్రమల్లో, పెయింట్, ప్లాస్టిక్ పరిశ్రమల్లో సాల్వెంట్‌గా ఉపయోగిస్తారని, ఇది




మాట్లాడుతున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మణికంఠరెడ్డి

అత్యంత ప్రమాదకమైనదని తెలిపారు. ఐసోప్రొఫైల్ ఆల్కహాల్ అనేది శానిటైజర్స్, ఆఫ్టర్ షేవ్ లోషన్, కాస్మొటిక్ ఉత్పత్తులలో ఉపయోగిస్తారన్నారు. మిథైల్ అసహజ ఆల్కహాల్, ఐసోప్రొఫైల్ ఆల్కహాల్ తదితరాలు సేవించడం వల్ల మానవుల్లో వెంటనే వాంతులు, కడుపునొప్పి, గొంతులో మంట, శ్వాసరేటులో మార్పు, శరీర ఉష్ణోగ్రత తగ్గిపోవడం, గుండె కొట్టుకోవడం, నెమ్మదించడం, కంటిచూపు కోల్పోవడం, కోమాలోకి వెళ్లి వెంటనే మరణించడం జరుగుతుందన్నారు. కాబట్టి ఆల్కహాల్ మధ్య భేదాన్ని గుర్తించి తగు అప్రమత్తతో ఉండాలని పరిశ్రమ యాజమాన్యానికి, కార్మికులకు సూచించారు. ఈ ఆల్కహాల్స్ ఉపయోగంలో ఎటువంటి మానవ జోక్యమునకు అవకాశం లేకుండా కేవలం యాంత్రికపరమైన జోక్యంతోటే కట్టుదిట్టమైన రక్షణ చర్యలతో వీటి రవాణా, లోడింగ్, అన్ లోడింగ్ వంటివి చేపట్టాలని ఇన్‌స్పెక్టర్ మణికంఠరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.మధుబాబు, హెడ్ కానిస్టేబుల్ కె. శ్రీనివాస్, ఫ్లూటాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ యాజమాన్యం పాల్గొన్నారు.

యోగా సరే.. సమస్యల మాటేంటి?

మరికొద్ది రోజుల్లో విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇప్పటికే ఫీజుల మోత మోగించడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల అమ్మకాలు బహిరంగంగానే కానిచ్చేస్తున్నాయి. మరోపక్క ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించాల్సి ఉంది. కాల్వలకు నీరు విడుదల చేసినా చాలాచోట్ల నిర్వహణా పనులు తదితర కారణాల రీత్యా కాల్వలకు నీరు రాని పరిస్థితి. ఖరీఫ్ సాగుకు సంబంధించి రుణ వితరణ తదితర అంశాలపై ఇప్పటి వరకూ జిల్లా అధికారులు దృష్టి సారించకపోవడం విస్మయం కల్గిస్తోంది. అంతా యోగాపై హడావిడి తప్ప జనం పాట్లుపై పాలకులు, అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

రెండు జిల్లాల్లో జిల్లా నుంచి మండలస్థాయి వరకూ అధికారులంతా యోగా కార్యక్రమాల నిర్వహణలో తలమునకలయ్యారు. దానికి ప్రాధాన్యతను ఇవ్వడాన్ని ఎవరూ తప్పుబట్టరు. అయితే కాలగమనంలో కొన్ని పనులు నిర్దిష్ట సమయంలో చేయకపోతే వచ్చే నష్టం ఎక్కువేనని అందరికీ తెలిసిందే. అందులో ఖరీఫ్ సాగు పనులు చాలా ముఖ్యమైనవి. జూన్ ఒకటో తేదీన ఆర్భాటంగా కాల్వలకు నీళ్లు విడుదల చేశారు. అయితే కాల్వల్లో నీళ్లు కానరాకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నీళ్లు విడుదల చేసి వారం రోజులైనందున ప్రతికాల్వలో ఎంతోకొంత నీళ్లుండటం సహజం. అయితే కాల్వల నిర్వహణ పనులు మే నెలాఖరున చేపట్టడంతో కాల్వలకు నీరు విడుదల పూర్తిస్థాయిలో చేపట్టలేదనేది బహిరంగ రహస్యం. ఇక్కడే పాలకుల చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తోంది. ఏప్రిల్‌లోనే కాల్వలు మూసేసినా వెనువెంటనే పనులు చేపట్టని ఫలితంగా ఇప్పుడు కాల్వలకు నీరు విడుదల చేయలేని దుస్థితి దాపురించింది. ఇక ఎండలు మండిపోతుండటంతో రైతులు సైతం ఖరీఫ్ నారుమళ్ల పనులు ప్రారంభించడానికి వెనుకాడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా



అధికారులు రైతులకు అవసరమైన విత్తనాలు పంపిణీ చేయడం, నీటి సమస్యను అధిగమించి పనులు చేపట్టడం, అవసరమైన రుణ వితరణ చేపట్టడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ జిల్లా అధికారులు ఖరీఫ్ సాగుపై సమీక్షించకపోవడం, ఆపై చర్యలు చేపట్టకపోవడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది.

ఇక విద్యాసంస్థలు వచ్చే వారంలో తెరుచుకోనున్నాయి. ఇప్పటికే ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు పూర్తి చేశాయి. ఫీజుల మోత మోగుతున్నా విద్యాశాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు. అదేక్రమంలో పుస్తకాల వ్యాపారం పెద్దఎత్తున విద్యాసంస్థలే నిర్వహిస్తుండటం గమనార్హం. దీనిపై ఎస్‌ఎఫ్‌ఐ తదితర విద్యార్థి సంఘాలు అభ్యంతరం చెప్పి పుస్తకాల విక్రయాలను అడ్డుకోవడమే కాకుండా అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటనలు ఉన్నాయి. అయితే దీనిపై అధికారుల స్పందన చాలా నామమాత్రంగా ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇటు ఆకివీడు, నిడమర్రు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే పుస్తకాల అక్రమ విక్రయంపై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కేవలం ఎంఇఒ కార్యాలయాల్లో ఉండే దిగువస్థాయి సిబ్బందిని పంపి ఆయా గదులకు తాళాలు వేయించడం మినహా ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఇప్పటికైనా జిల్లా అధికారులు రంగంలోకి దిగి అటు ఖరీఫ్ సాగుకు అవసరమైన చర్యలు చేపట్టడంతోపాటు రైతుకు వెన్నుదన్నుగా ఉండేలా రుణాల మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. అదే క్రమంలో విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీపై ప్రత్యేక కేంద్రీకరణ చేసి అక్రమ పుస్తకాల వ్యాపారం వంటి వాటిని నిరోధించాలి. లేనిపక్షంలో అటు రైతులు, ఇటు విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. మరి పాలకులేమో నామినేటెడ్ పదవులపై, అధికారులేమో యోగాపై తలమునకలై ఉన్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ రెండింటిపై దృష్టి సారించాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా భూపతిరాజు రవీంద్ర రాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా స్థానిక మండలానికి చెందిన రెవెన్యూ శాఖ ఉద్యోగి, ఆ సంఘ నాయకులు భూపతిరాజు రవీంద్ర రాజు మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనకు ఈ హ్యాట్రిక్ అవకాశం కలిగించిన రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, అసోసియేట్ అధ్యక్షులు బి.సుగుణమ్మతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం గురించి నిరంతరం కృషిచేస్తానని ఆయన తెలిపారు.





వల్లూరులో మజ్జిగ చలివేంద్ర కేంద్రం..

మజ్జిగ చలివేంద్రాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

ఈనెలలో వేసవిని తలపించేలా మండుతున్న ఎండలకు ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్ర కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వల్లూరు గ్రామానికి చెందిన బెజవాడ అమర్నాథ్ తెలిపారు. వల్లూరులో ఆక్వా ఫుడ్స్ షాప్ వద్ద శ్రీకనకదుర్గ ట్రేడర్స్, దాతల సహకారంతో మజ్జిగ చలివేంద్ర కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గత వారం రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు, పాదాచార్లు అల్లాడుతున్న నేపథ్యంలో మజ్జిగ చలివేంద్ర కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎండలు తగ్గే వరకు ఈ మజ్జిగ చలివేంద్ర కేంద్రాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు.




స్టాకును పరిశీలిస్తున్న తహశీల్దార్ నాగార్జున

సరుకులు సక్రమంగా పంపిణీ చేయండి

తహశీల్దార్ కావడి నాగార్జున

ప్రజాశక్తి - ఉండి

తెల్ల రేషన్‌కార్డు దారులకు రాష్ట్ర ప్రభుత్వమిచ్చే బియ్యం, పంచదార వంటి సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని రేషన్ డీలర్లకు ఉండి మండల తహశీల్దార్ కావడి నాగార్జున సూచించారు. శనివారం ఉండి మండలం వెలివర్రు గ్రామంలోని రేషన్ దుకాణాన్ని నాగార్జున తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌ను, స్టాకును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు అందరూ వారి పరిధిలో ఉన్న 65 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్క తెల్ల రేషన్ కార్డుదారునికి సరుకులను ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.



గజమాలలో చాగంటి చిన్నా, ఎంఎల్‌ఎ, కొత్తపల్లి, మాధవ నాయుడు

డిసిఎంఎస్ ఛైర్మన్ చిన్నాకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - నరసాపురం

డిసిఎంఎస్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా నరసాపురం నియోజకవర్గానికి విచ్చేసిన చాగంటి మురళీకృష్ణ(చిన్నా)కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముత్యాలపల్లి నుంచి మొగల్తూరు, సీతారామపురం, రుస్తుంబాద, నరసాపురం టౌన్, మెయిన్ రోడ్డు, పంజా సెంటర్, పీచుపాలెం, లక్ష్మణేశ్వరం మీదగా చాగంటివారి మెరక వరకూ పెద్ద ఎత్తున ఆయన అభిమానులతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో క్రేన్‌తో భారీ గజమాల వేశారు. అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డిసిఎంఎస్ చిన్నాతో ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడులు ఊరేగింపుగా పర్యటించారు. బాణాసంచా కాల్పులు, తీన్మార్ డప్పులతో బైక్ ర్యాలీ సాగింది.

చైన్ స్నాచింగ్ కేసులో యువకుడు అరెస్ట్

నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గా ప్రసాద్

ప్రజాశక్తి - నరసాపురం

చైన్ స్నాచింగ్ కేసులో యువకుడును అరెస్టు చేసినట్లు నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గా ప్రసాద్ తెలిపారు. శనివారం నరసాపురం సర్కిల్ కార్యాలయంలో రూరల్ ఎస్‌ఐ టి.వెంకటసురేష్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మే 29వ తేదీన మండలంలోని యర్రంశెట్టివారి పాలెం అరవ ఆకనవారిమెరకకు చెందిన చెన్ను లక్ష్మి భర్త వెంకటేశ్వరరావుతో కలిసి నరసాపురం హాస్పిటల్‌కి వెళ్లింది. హాస్పిటల్ పని ముగించుకొన్న తర్వాత తిరిగి నరసాపురంలో ఆటో ఎక్కి యర్రంశెట్టివారి పాలెం రోడ్‌లో దిగి నడిచి వెళ్తుంది. ఇంటికి నడుచుకుంటూ వెళుతూ ఉండగా అరవ ఆకనవారి మెరకలో ఉన్న మర్లమ్మ అమ్మవారి గుడి దగ్గరకు వచ్చేటప్పటికి గుర్తుతెలియని వ్యక్తి బంగారపు నల్లపూసల తాడును లాక్కుని వెళ్లిపోయాడు. దీనిపై బాధితురాలు నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా నరసాపురం రూరల్ ఎస్‌ఐ టి.వెంకట సురేష్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి ఉత్తర్వుల మేరకు నరసాపురం డిఎస్‌పి జి.శ్రీవేద పర్యవేక్షణలో నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నరసాపురం రూరల్ ఎస్‌ఐ టి.వెంకట సురేష్ దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 6వ తేదీన సాయంత్రం 6 గంటలకు రుస్తుంబాద గ్రామంలో లేప్రోసి హాస్పిటల్ దగ్గరలోని అన్నపూర్ణ గార్డెన్స్ ఎదురుగా ముద్దాయిని నరసాపురం టౌన్‌కు చెందిన చలపక విజయ్ కుమార్ రాజు, ఎ.విజయ్ అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.17.760 గ్రాముల బంగారు నల్లపూసల దండ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 7వ తేదీన కోర్టులో హాజరు పరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కానిస్టేబుల్ పి.పుల్లారావు, ఉమా, పి.దుర్గా ప్రసాద్ ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నరసాపురం రూరల్ సిఐ దుర్గా ప్రసాద్

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పెదఅమిరం గ్రామ కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామీణ అవసరాల, సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పెదఅమిరం గ్రామ కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. గ్రామంలో ప్రధానంగా మంచినీటి, డ్రెయినేజీ, అపారిశుధ్యం సమస్యలపై దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

చిట్ - చాట్

ప్రశ్న : గ్రామంలో డ్రెయినేజీ సమస్యను ఎలా పరిష్కరిస్తారు?

కార్యదర్శి : గ్రామంలో ప్రధాన వీధుల్లో ఉన్న సిమెంట్ డ్రెయినేజీలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగిస్తాం. ఇళ్ల ముందర ఉన్న డ్రెయినేజీలో చెత్తాచెదారాలు వేయకుండా సిమెంటు బల్లలు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న : గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు?

కార్యదర్శి : నీటి వనరులను కాలుష్యం, ఇతర మార్పుల నుంచి కాపాడటం ద్వారా నీటి నాణ్యతను మెరుగుపరుస్తాం. నీటిని శుద్ధి చేసి ప్రజలకు మంచినీటిని అందించడం ద్వారా నీటి నాణ్యతను మెరుగుపరుస్తాం.



ప్రశ్న : గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలకు ఏం చర్యలు చేపట్టారు?

కార్యదర్శి : గ్రామంలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ఒక ట్రాక్టర్, మూడు రిక్షాల ద్వారా డంపింగ్ కేంద్రాలకు తరలిస్తాం. గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్మికులకు సూచిస్తున్నాం. ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహిస్తూ పారిశుధ్యం మెరుగుపరుస్తున్నాం.

ప్రశ్న : గ్రామ పంచాయతీ, ప్రజల మధ్య మీరు వారధిలా ఎలా వ్యవహరిస్తారు?

కార్యదర్శి : ప్రజల నుంచి సమాచారం సేకరించడం, వారికి అవసరమైన సేవలను అందించడం, గ్రామ పంచాయతీ, ప్రజల మధ్య సమన్వయం కల్పించడం జరుగుతుంది.




నెగ్గిపూడి వద్ద జరుగుతున్న కల్వర్టు పనులు

15 వరకు కల్వర్టు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

నరసాపురం-ప్రక్కిలంక మార్గంలో నరసాపురం-విజ్జేశ్వరం పంట కాల్వను ఆనుకొని మండలంలోని నెగ్గిపూడి(మార్టేరు) వద్ద గడచిన నెల రోజులుగా సాగుతున్న కల్వర్ట్ నిర్మాణ పనులు ఈనెల 15 వరకు జరుగుతాయని ఆర్‌అండ్‌బి ఎఇ టిఆర్‌వి.ప్రసాద్ శనివారం ఇక్కడ తెలిపారు. ప్రస్తుతం కల్వర్ట్ స్లాబ్ నిర్మాణం పూర్తయ్యి, కాంక్రీట్ సైడ్ వాల్స్, తదితర నిర్మాణాలు బిగించడానికి వాటర్ క్యూరింగ్ చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రూ.59 లక్షల నిర్మాణ వ్యయంతో జరుగుతున్న ఈ పనులు ఈనెల 15కు పూర్తి చేసి, ఈ రోడ్డును రాకపోకలకు అందుబాటులోకి తెస్తామని ఆయన పేర్కొన్నారు.



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

విద్యార్థులకు నోట్ బుక్స్ వితరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ పరిధిలోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రెమిడీయల్ టీచింగ్(పునశ్చరణ తరగతుల)కు దాత ధర్మ పరిరక్షణ అధ్యక్షులు గాదె వెంకన్న సౌజన్యంతో నోట్‌బుక్స్, పెన్సిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని అభ్యసన కృత్యాలు సాధించడంలో ముందు వరుసలో ఉండాలని హెచ్‌ఎం భవానీప్రసాద్ రాయపూడి విద్యార్థులకు వివరించారు.

10 వరకూ ఆన్‌లైన్ సేవలకు అంతరాయం

ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు


ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 10వ తేదీ వరకు సచివాలయాల్లో ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలుగుతుందని ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో మంగళవారం రాత్రి వరకు అన్నిరకాల ఆన్‌లైన్ సర్వీసులు నిలిచిపోనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ తెలిపిందని ఆయన అన్నారు. ఎపి సేవ పోర్టల్ మైక్రోసాఫ్ట్ క్లౌడ్ నుంచి రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలిస్తున్న కారణంగా ఈ అంతరాయం కలగనున్నట్టు వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మీ సేవా కేంద్రాల్లో సైతం కొన్ని రకాల సేవలు నిలిచిపోతాయని వివరించారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, సమగ్ర ధ్రువీకరణ పత్రం, భూమి మ్యుటేషన్లు, రేషన్ కార్డు, ఇళ్ల స్థలాల పట్టాల దరఖాస్తులు వంటివి, వృద్ధాప్య ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రం, రెవెన్యూ, వాటర్ ట్యాక్స్, పట్టణ పరిపాలన సంబంధిత సేవలు, మత్స్యశాఖ సేవలు మీ సేవలో సైతం అందుబాటులో ఉండవని వివరించారు. ఇతర ప్రభుత్వ సేవలు మాత్రం మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

అనారోగ్య బాధితురాలికి వసుధ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

బోనెమెరో వ్యాధితో బాధపడుతున్న మహిళకు పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు వసుధ ఫౌండేషన్ తరపున శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. యలమంచిలి మండలం గుంపర్రు గ్రామానికి చెందిన బండి సత్యవాణి బోనెమెరో వ్యాధితో కొంతకాలంగా బాధపడుతుంది. ప్రతి 15 రోజులకు ఒకసారి ఈమె రక్తమార్పిడి చేయించుకోవాలి. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్దరాజు ద్వారా విషయం తెలుసుకున్న భగవాన్‌రాజు రూ.10 వేల నగదు క్లబ్ తరుపున వైద్య సహాయం నిమిత్తం ఆమె తండ్రి మామిడిశెట్టి త్రినాథ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సభ్యులు ఐవి.రామరాజు, ఎ.త్రిమూర్తులురాజు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న గాంధీ భగవాన్ రాజు

ప్రతిభా పురస్కారానికి భావన ఎంపిక

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామానికి చెందిన ఎస్.భావనకు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించడంతో ప్రతిభా పురస్కారంకు ఎంపికైనట్లు విద్యార్థిని తండ్రి ఎస్.గణేష్ శనివారం తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు ప్రభుత్వం వివిధ కేటగిరీల కింద ప్రతిభా పురస్కారాలను ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. భీమవరంలో గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కాలేజ్ అధ్యాపకులకి, ప్రిన్సిపల్‌కి కృతజ్ఞతలు తెలిపారు. సిఇసి గ్రూపులో జిల్లా టాపర్ (957/1000)గా నిలిచిందన్నారు. ఈ అవార్డుని ఈనెల తొమ్మిదో తేదీ సోమవారం ఉదయం భీమవరం జువ్వలపాలెం రోడ్‌లో ఉన్న ఎఎస్‌ఆర్ సాంస్కృతిక కళ్యాణ మండపంలో అందజేయడం జరుగుతుందని తెలిపారు.



సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


భీమవరం టౌన్ : భీమవరం నియోజవర్గ టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన ఆరేటి రంగారావు అనారోగ్యంతో ప్రయివేట్ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకున్నారు. వారికి ఆర్థిక సహాయంకు ముఖ్యమంత్రికి ఆర్థిక సహాయాన్ని చేయవలసిందిగా సిఫార్సు చేయగా సిఎంఆర్‌ఎఫ్ నిధుల నుంచి రూ.49 వేల ఆర్థిక సహాయం చెక్కు రూపంలో మంజూరు చేయడం జరిగిందని, శనివారం వారి భార్యకు ఈ చెక్కును పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కొయ్యలగడ్డ గణపతి, కోళ్ల సీతారాం, భీమవరం పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము, చల్లబోయిన గోవింద్, టిడిపి నాయకులు గంటా త్రిమూర్తులు, కొండ్రు శ్రీనివాస్, నేదునూరి గంగాధర్ తిలక్, గొలగాని రమేష్, యలమంచిలి శ్రీనివాస్, దొంగ వెంకటేశ్వరరావు, చల్లబోయిన జయరాజ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్య వ్యాపారాన్ని నియంత్రించాలి

ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అప్పలస్వామి


ప్రజాశక్తి - భీమవరం

ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో విచ్చలవిడిగా ఫీజుల దోపిడి అరికట్టాలని, విద్య వ్యాపారాన్ని నియంత్రించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఎఐఎస్‌ఎ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్లో డిఇఒ సిసి పృథ్వికి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో అడ్డు, అదుపు లేకుండా విచ్చలవిడిగా ఫీజులు సంబంధిత యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయని వీటిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీచేసిన జిఒ నెంబర్ 42 ప్రకారం ఎల్‌కెజి నుంచి ఏడవ తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.7,800, పట్టణ ప్రాంతాల్లో రూ.9 వేలు, ఎనిమిదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు రూ.12 వేలు లోపు మాత్రమే ఫీజులు వసూలు చేయాలని, అంతకంటే ఎక్కువ ఫీజులు వసూలు చేయాలంటే పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఆమోదం తర్వాత జిల్లా ఫీజుల నియంత్రణ కమిటీ ఆమోదించాలని విద్యా హక్కు చట్టం చెబుతుందన్నారు. దీనికి భిన్నంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తుంటే విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎ నాయకులు పుల్లూరి రాంప్రసాద్, ఎం.రాజు పాల్గొన్నారు.



వినతిని అందజేస్తున్న ఎఐఎస్‌ఎ నాయకులు

త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ



తణుకులో పాల్గొన్న ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

భక్తి, విశ్వాసం, త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. శనివారం బక్రీద్ పర్వదినం పురస్కరించుకొని తణుకు పట్టణంలోని పలు మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో మంచిని పెంచే విధంగా భక్తి, విశ్వాసం, నమ్మకంతో మనతోపాటు మన కుటుంబం, సమాజం అభివృద్ధి చెందాలని పండుగ ఇచ్చే సందేశమన్నారు. అందుకు అనుగుణంగా సమాజ నిర్మాణానికి పాటుపడే విధంగా అల్లా ఆశీస్సులతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరికి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపవరం : బక్రీద్ సందర్భంగా శనివారం గణపవరం మసీదులో ముస్లిం సోదరులు ఉదయం ఏడు గంటలకే స్థానిక మసీదుకు చేరుకొని ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ వేడుకలకు గణపవరం చుట్టు పక్కల గ్రామాలనుంచి అధిక సంఖ్యలో ముస్లింలు వచ్చి ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు మహమ్మద్ జాని ఇస్మాయిల్ షేక్ రహిమతుల్లా, షేక్ బషీరిద్దీన్, షేక్ నాగూర్, మహమ్మద్ జాని పాల్గొన్నారు.

పలుచోట్ల వేడుకలు

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు గ్రామం జామియా నూర్ మసీదులో ముస్లిం సోదరులు ఈదుల్ జుహా నమాజ్ కార్యక్రమం నిర్వహించారు. సర్వ మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలని, అందరూ సమాజంలో సోదర భావంతో మెలగాలని, ప్రత్యేకమైన ప్రార్థనలు చేశామని మసీదు పెద్దలు తెలిపారు. ఈ ప్రత్యేక నమాజు ప్రార్థనల్లో స్థానిక జామియా నూర్ మసీదు ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్లా, వైస్ ప్రెసిడెంట్ గౌస్ మొద్దీన్, సెక్రటరీ షేక్ బాబ్జి(లేఖరి), ట్రెజరీ ఎండి ముక్తార్, సహాయ కార్యదర్శి రెహమాన్, షేక్ మహమ్మద్ అలీ, షేక్ అబ్బాస్, ఎండి జాంగిర్‌ల ఆధ్వర్యంలో అనేకమంది ముస్లిం సోదరులు పాల్గొని నమాజ్ చదివారు.



పెనుమంట్రలో..

నరసాపురం : తీర ప్రాంతంలో శనివారం ముస్లీం సోదరులు భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకున్నారు. పట్టణంలోని మిషన్ హైస్కూల్ రోడ్‌లోని ఈద్గాలో ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పంజా సెంటర్, పాత బజార్ సెంటర్లలోని ముస్లీం సోదరులు పెద్ద ఎత్తున్న ఈద్గాకు తరలివచ్చారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగానికి, మానవత్వానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ఖాజీ ఇమ్రాన్ ప్రసంగించారు. పేదవారికి దానం చేయడమే ఈపండుగ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ బుల్లిమస్తాన్, దావూద్ ఖాన్, బడేవలి, మౌలాలీఖాన్, ఖాజా, ఆసిఫ్, యూసుఫ్, బాబి పాల్గొన్నారు.



నరసాపురంలో..



గణపవరంలో..



మాట్లాడుతున్న కెవి.ప్రభుకుమార్

ఎక్సైజ్ స్టేషన్ సందర్శన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏలూరు కెవి.ప్రభు కుమార్ శనివారం సందర్శించారు. పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరు సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్, ఎస్‌ఐలు ఆయనకు స్వాగతం పలికారు.

బండి ముత్యాలమ్మ సన్నిధిలో ఇంటెలిజెన్స్ డిఎస్‌పి దంపతులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారిని శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఇంటెలిజెన్స్ డిఎస్‌పి మేక సుధాకర్, కనకదుర్గ దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్‌లు అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాన్ని అందించారు.

ఐదుగురు తహశీల్దార్ల బదిలీ

ఏలూరు: రెవెన్యూ శాఖలో బదిలీల పర్వం కొనసాగింది. ముఖ్యంగా మండలాల్లో కీలకంగా వ్యవహరించే తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు జరిగాయి. బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు శనివారం జిల్లా కలెక్టరేట్ అధికారులు విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం ఐదుగురు తహశీల్దార్లు బదిలీ అయ్యారు. కొయ్యలగూడెం తహశీల్దార్ కె.చెల్లన్నదొర కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యా రు. ఏలూరు రూరల్ మండల తహశీల్దార్‌గా జి.విజయకుమార్‌రాజు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈయన కలెక్టరేట్‌లోని ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో స్పెషల్ తహశీల్దార్ ఎఒగా పని చేస్తూ తహశీల్దార్‌గా నియమితులయ్యారు. కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న పి.రవికుమార్‌ను మేజిస్టీరియల్ సెక్షన్ స్పెషల్ తహశీల్దార్‌గా, కలెక్టరేట్‌లో పని చేసే ఎమ్‌డి.నజిముల్లా షాను లింగపాలెం తహశీల్దార్‌గా, ఏలూరు అర్బన్ తహశీల్దార్ జివి.శేషగిరిని కలెక్టరేట్ ల్యాండ్ మేటర్స్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళ మండలం వేంపాడు గ్రామానికి చెందిన పల్లి అచ్చన్న, తండ్రి: సుబ్బారావు, డోర్ నెంబర్ 2-116. నకు చెందిన, **N3181758** నెంబర్ గల పాస్పోర్ట్ పోయినది. వేంపాడు నుంచి కాళ్ళ వీసా నిమిత్తం మోటర్ సైకిల్‌పై వెళుతుండగా పాస్పోర్ట్ కలిగిన కవరు మార్గమధ్యంలో పడిపోయింది. ఆ కవర్లో విశాఖపట్నం వారి 22-09-2015 న జారీ చేసిన **N3181758** ఒరిజినల్ పాస్పోర్టు కలిగి ఉంది. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు సంప్రదించగలరు.

పల్లి అచ్చన్న
తండ్రి: సుబ్బారావు
డోర్ నెం: 2-116, మెయిన్ రోడ్డు,
వేంపాడు, కాళ్ళ మండలం,
ప॥గో॥జిల్లా, పిన్కోడ్ నెం: 534206
సెల్ నెం: 77993 18713

In the Court of Hon'ble Principal Civil Judge (Junior Division), Bhimavaram
E.P. No. 32/2024
O.S. No. 102/2022

Between:
Sri Ketanapalli Gopinath, S/o. Subba Rao, 52 years, Male, Cultivation, R/o. Brahmanagudem, Chagallu Mandal, Nidadavolu JCJCJ ...*DHr/ Plaintiff*
AND
Sri Javvadi Ratna Kumar, S/o. Srinivasa Rao, 31 years, Male, Business, D.No. 6-180, Rayalam, Totaboyina vari Veedhi, Chinna Amiram, Bhimavaram, W.G.Dt. BVRM JCJCJ. ...*JDr/ Defendant*

పై నెంబరు Execution Petition లో JDr కు కోర్టు ఆర్డరు ప్రకారం కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు మరియు R.P. లు పంపినను J.Dr. Evade చేస్తున్న కారణం చేత పేపరు పబ్లికేషను ద్వారా సదరు JDr కు **ది. 23-6-2025వ తేదీన వాయిదా అని తెలియజేయడమైనది.** సదరు వాయిదాకు JDr హాజరు కాని యెడల అతనిని Exparty చేసి పరోక్షమున తదుపరి గ్రంధము జరుపబడునని తెలియజేయడమైనది.

NANDIGAM SUBBA RAO
Advocate, Nidadavole
Cell: 9247563882

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు , భీమవరం

S.O.P. 1/2025

PETITIONER:SALAKA JVLSM DEEPIKA S/o.Valluri V R Pavan Kmar, D/o. Salaka Subba rao, Hindu – wife , 34 yrs D.12-7-19/B, Nanduri vari street, BHimavaram – 534201
Respondents : **1. SALAKA JOGA SEHARATNAM** w/o. (late) subbrao , D.No.8-3-231/B/412/A,4th floor , 1st portion, rights 5th lane, Srikrishna Nagar, B-Block, Yousafguda, Hyderabad – 500045, **2.RELIANCE INDUSTRIES LTD.**, Regd.Ofice : 3rd Floor, maker Chambers IV,222, Nariman point, Mumbai -400021

దిగువ షెడ్యూల్ షేర్ సర్టిఫికెట్ నిమిత్తం పిటీషనర్ తన పేరున succession certificate ఇప్పించవలసినదిగా కోరుచూ పైనెంబరు పిటీషను పై కోర్టులో దాఖలు చేసుకున్నారు. సదరు విషయంపై ఎవరికైనా అభ్యంతరములు కాని ఆక్షేపణలు కాని యున్న యెడల **ది.17.06.2025**న ఉ॥ 10.30 ని॥లకు పై కోర్టులో స్వయముగా కాని అడ్వకేట్ గారితో కాని హాజరు అయి అభ్యంతరములు తెలుపకొవలసినది. లేనియెడల శ్రీ కోర్ట్ వారు పిటీషనర్ తరపు తీర్మానం చేయగలరు.

Name of the Company	Folio No & certificate No.	No. of Shares	Price	Amount
Reliance industries Limited	10637341162523069	45	45x3,135	1,41,075-00
Reliance industries Limited	10637341157810612	45	45x3,135	1,41,075-00
Reliance industries Limited	08418850666792828	90	90x3,135	2,82,150-00
			Total	5,64,300-00

N.R.P. AMMI RAJU,(RAGHU) Advocate
BHIMAVARAM,Cell:**94900 42080**